క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


ఊయలసేవలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి కూడా విశేష పూజలు నిర్వహించారు.

బహుమతుల ప్రదానం


బహుమతులను అందిస్తున్న పీఈటీ

ఆత్మకూరు: మండలంలోని నల్లకాల్వ గ్రామంలో తెలుగుబాపిస్టు చర్చి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు పీఈటీ పుల్లయ్య బహుమతులు అందజేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని అందిస్తాయన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడల్లో రాణించి మంచి పేరు తేవాలన్నారు. అనంతరం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నల్లకాల్వ తెలుగు బాపిస్టు చర్చి సంఘం నాయకులు, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

మహానందీశుడి దంపతులకు పల్లకీసేవ


మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ వేదపండితులు, అర్చకులు గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మహా మంగళ హారతులు, బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం కనులపండువగా సాగింది. పలు ప్రాంతాల భక్తులు పల్లకీ మోస్తూ స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కోసం ఇదే గ్రామానికి చెందిన దాసరి చిన్న చెన్నయ్య, కేశాలమ్మ దంపతులు రూ.25,116 విరాళం ఇచ్చారు. శుక్రవారం ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి, ఆలయ అర్చకులకు నగదు అందజేశారు. దాతలను ఆలయ సంప్రదాయం ప్రకారం సన్మానించారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవ శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయించారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

జాగ్రత్తలతో ఎండ నుంచి రక్ష

డోన్ టౌన్: జాగ్రత్తలతో పాటు వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తే ఎండ నుంచి ఉపశమనం పొందవచ్చని డోన్ ప్రభుత్వాస్పత్రి వైద్యులు కళ్యాణ్‌బాబు, సుకుమార్, శశికుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగరాణి అన్నారు. శుక్రవారం ఎండ నుంచి ఎలా రక్షణ పొందాలి అనే అంశంపై రోగులు, వారి బంధువులకు అవగాహన కల్పించారు.

వేసవిలోనూ వర్షాకాలం!

- విస్తారంగా అకాల వర్షాలు
- సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు
- రోహిణి కార్తెలోనూ వర్షాలు పడతాయంటున్న శాస్త్రవేత్తలు


ఆత్మకూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఈయేడాది వేసవికాలం.. వర్షాకాలాన్ని తలపిస్తోంది. అకాల వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వడగండ్ల వర్షంతోపాటు పిడుగులు కూడా పడ్డాయి. మార్చి నుంచి మే నెల వరకు సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. మార్చిలో 1, 2 రోజులు స్వల్పంగా వర్షం కురిసినప్పటికీ ఏప్రిల్, మే నెలల్లో భారీ వర్షాలు కురిశాయి. ఏప్రిల్‌లో సాధారణ వర్షపాతం 16 మి.మీ కాగా 98.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే రికార్డుస్థాయిలో 75 శాతానికి పైగా అధిక వర్షం కురిసింది. ఇక మేలో సాధారణ వర్షపాతం 29 మి.మీ. కాగా 15 రోజులకే 50 శాతానికి పైగా వర్షపాతం నమోదైంది. కాగా మరిన్ని వర్షాలు కురుస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

రోహిణి కార్తెలో ఎండలు కరువు

ఈ యేడాది ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు దేశాన్ని తాకడం, ఈనెల చివరి నాటికి ఏపీ చేరుకోవడంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో రోహిణికార్తెలో రోళ్లు పగిలేలా ఎండలు ఉండే పరిస్థితి లేదేమోనని పలువురు పేర్కొంటున్నారు. మృగశిర కార్తె వచ్చే వరకు వర్షాలు కురవకపోవడం సాధారణం. మృగశిర కార్తె వచ్చిందంటే చల్లబడడం నానుడి. అయితే ఈసారి వర్షాలు విస్తారంగా కురవడంతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. పగలు ఎండలు, రాత్రిపూట భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే భూగర్భ జలాలు పెరిగాయి. మండలంలోని ముష్టపల్లి, నల్లకాల్వ, కొత్త రామాపురం, కరివేన గ్రామాల్లోని బావుల్లో సగానికిపైగా నీరు చేరిందని రైతులు చెబుతున్నారు. ముందస్తుగా వర్షాలు వచ్చి.. విత్తు వేసిన తర్వాత రాకపోతే పరిస్థితి ఏమిటని రైతులు చర్చించుకుంటున్నారు. కాగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతన్నలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.


బైర్లూటీలో కురిసిన వడగండ్ల వర్షం

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

జూపాడుబంగ్లా: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ నియోజకవర్గ కన్వీనర్ అయ్యస్వామి సూచించారు. శుక్రవారం పారుమంచాల గ్రామ సచివాలయంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తొలకరి చినుకులకు ముందు నవధాన్యాలు, జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసుకుంటే భూసారం పెరిగి ప్రధాన పంటలకు చీడ, పీడల వ్యాప్తి తగ్గి అధికదిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. మహిళా రైతులు పొదుపు గ్రూపుల్లాగా 10 మందితో గ్రూపుగా ఏర్పడితే వారితో ఎఫ్‌పీఓ గ్రూపులను ఏర్పాటుచేసి వ్యవసాయంలో రాణించేందుకు రుణాలు, వ్యవసాయ సలహాలు ఇస్తామన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం అలవర్చుకోవాలంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాశం, వీఏఏ బాషా, వీఓఏ సావిత్రి, ఎఫ్ఏ చింతలయ్య పాల్గొన్నారు.

సైనికుల త్యాగం శ్లాఘనీయం


త్రివర్ణ పతాకంతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

పగిడ్యాల: ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌కు రెండు రోజుల్లోనే ముచ్చెమటలు పట్టించి ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసిన భారత సైనికుల వీరోచిత త్యాగం శ్లాఘనీయమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండు ఆవరణం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు చేపట్టిన తిరంగ్(త్రివర్ణ పతాక) ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 50 మీటర్ల పొడవున్న జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. మండల స్థాయి అధికారులు జాతీయ జెండాలను చేతపట్టి విద్యార్థులతో కలిసి నడిచారు. ఆపరేషన్ సిందూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సైనికుల ధైర్య సాహసాలు భావితారలకు ఆదర్శమన్నారు. అంతకు ముందు యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్‌లకు అశ్రుని వాళి అర్పించి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, డిప్యూటీ తహసీల్దార్ మధు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు 18న ప్రవేశ పరీక్ష

పాములపాడు: కర్నూలులోని వావిలాల కృష్ణమూర్తి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రీ రెసిడెన్సియల్ ఫర్ గర్ల్స్ హై స్కూల్‌లో 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వావిలాల కృష్ణమూర్తి ట్రస్టు కోశాధికారి, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రమణారెడ్డి శుక్రవారం తెలిపారు. మరిన్ని వివరాలకు 9848626114, 9000011477 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు సర్వ సభ్యసమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశభవనంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మేరి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఎంపీపీ కుసుమలత అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

కౌలు కార్డులతో ప్రయోజనాలు

బండిఆత్మకూరు: కౌలు గుర్తింపు కార్డుతో ప్రభుత్వం నుంచి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో సీసీఆర్(క్రాప్ కల్టివేటర్ రైట్స్) కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్దతు ధరకు పంటలను విక్రయించుకునేందుకు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు పొందేందుకు, నష్టపరిహారం మంజూరుకు కచ్చితంగా కౌలు గుర్తింపు కార్డు ఉండాలన్నారు. ఇతర రైతుల నుంచి భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులు కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు.

కొలనుభారతిదేవికి పూజలు



ప్రత్యేక అలంకరణలో కొలనుభారతిదేవి అమ్మవారు, సామూహిక అక్షరాభ్యాసాలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతి దేవి ఆలయంలో భక్తులు సరస్వతీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతీ తదితర పూజా క్రతువులు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వారి చిన్నారులకు కుటుంబ సమేతంగా ఆలయ పురోహితులు శ్రీనివాస శర్మ బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి


బైర్లూటీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని బైర్లూటీ పీహెచ్‌సీ వైద్యాధికారులు పవన్‌కుమార్, గోపాల్ గిరిజనులకు సూచించారు. శుక్రవారం బైర్లూటీ చెంచుగూడెంలో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పగటి పూట కుట్టే దోమల వల్ల డెంగీ వ్యాధి వస్తుందన్నారు. నీటి తొట్టెలు, కుండల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేయరాదన్నారు. పూలకుండీలు, పెంకులు, కొబ్బరిబోండాలు, పనికిరాని టైర్లు, సీసాలు, నీటి ట్యాంకుల వద్ద, కూలర్లలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచరాదన్నారు. ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మనీషా, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

మహానంది: వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తిమ్మాపురం పీహెచ్‌సీ డాక్టర్ వేణుకార్తికేయ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిమ్మాపురం పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుకార్తికేయ మాట్లాడుతూ ఆహారం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో అపరిశుభ్రత, మురికినీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: కౌలు రైతులు గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం తరిగోపుల గ్రామ రైతుసేవా కేంద్రంలో కౌలురైతు గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. ఇతరుల నుంచి పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న రైతులు కౌలు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

నందికొట్కూరు: సమస్య పరిష్కారం కావాలంటే ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన మేటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలు, మేటీలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈనెల 20న తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఉపాధి మేటీల మండల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం నాయకులు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయం

మహానంది: పుట్టగొడుగుల పెంపకం ద్వారా మహిళలకు ఆర్థిక ఆదాయం చేకూరుతుందని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. మహానంది వ్యవసాయ కళాశాలలో శుక్రవారం బీఎస్సీ అగ్రికల్చర్ మూడో సంవత్సరం విద్యార్థినులకు పుట్ట గొడుగుల పెంపకం, మహిళల పోషకాహార, ఆర్థిక సాధికారత అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీ జయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నో పోషక విలువలు కలిగిన పుట్టగొడుగులకు మార్కెట్‌లో ఆదరణ ఉందన్నారు. వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అవగాహన కల్పించి పుట్టగొడుగుల పెంపకం, విధానం, లాభాలపై వివరించారు. ముత్యపు చిప్ప పుట్టగొడుగుల పెంపకం, నిర్వహణ యాజమాన్యం కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ఓఎస్ఏ డాక్టర్ ఎల్. విజయభాస్కర్, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ జి.ఫరీదా, డాక్టర్ గురివిరెడ్డి పాల్గొన్నారు.

భక్తుల ముసుగులో దొంగల చేతివాటం


సీసీ కెమెరాల్లో గుర్తించిన అనుమానితులు

మహానంది: మహానందిలో భక్తుల ముసుగులో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన శంకర్ నాయక్, కుటుంబ సభ్యులు శుక్రవారం మహానంది వచ్చారు. స్నానాలు చేసేందుకు పురుషుల కోనేరులోకి వెళ్తూ వారి దుస్తులు, నగదు, ఇతర విలువైన వస్తువులను ప్యాంటులో పెట్టి వెళ్లారు. అప్పటికే గమనించిన ముగ్గురు దొంగలు చాకచక్యంగా ఎవరి కంట పడకుండా ప్యాంట్‌ను ఎత్తుకెళ్లి అందులో ఉన్న రూ.30 వేల నగదు తస్కరించి ప్యాంట్‌ను అక్కడే పడేసి వెళ్లారు. బయటికి వచ్చిన భక్తులు లబోదిబోమంటూ హోంగార్డు నాయక్, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. వారు సీసీ కెమెరాలను పరిశీలించి అనుమానంగా తిరుగుతున్న ముగ్గురిని గుర్తించారు. వారిలో ఓ యువకుడు ప్యాంట్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించి ఆలయ పరిసరాలతో పాటు చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. వారి జాడ లేకపోవడంతో బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

తంగడంచ ఫారం భూములు సోలార్‌కు కేటాయిస్తే ఉద్యమిస్తాం


తంగడంచ ఫారం భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారం భూములను సోలార్ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి కేటాయిస్తే రైతులతో కలిసి ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా నాయకుడు రంగనాయుడు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి సోమన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఉన్న 211 ఎకరాల భూములను శుక్రవారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములను అభివృద్ధి చేసి నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తిచేసి రైతులకు ఇవ్వాలని కోరారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురామ్మూర్తి, రమేష్‌బాబు, శ్రీనివాసులు, వెంకటశివుడు, శ్రీను, శ్రీరాములు, దివాకర్ పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వే పక్కాగా చేపట్టాలి

- సర్వే శాఖ జిల్లా అధికారి టీఎం కృష్ణకుమార్


రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న సర్వే శాఖ జిల్లా అధికారి టీఎం కృష్ణకుమార్

జూపాడుబంగ్లా: సమగ్ర భూసర్వే పక్కాగా చేపట్టాలని సర్వే శాఖ జిల్లా అధికారి టీఎం కృష్ణకుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మండ్లెం గ్రామ పరిధిలో జరుగుతున్న సమగ్రభూసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సూచనలిచ్చారు. భూసర్వే చేసిన వెంటనే అక్కడికక్కడే రైతులకు వారి భూ అనుభవ విస్తీర్ణం వివరాలు, ఎక్కువ, తక్కువ వచ్చిన వివరాలు తెలియజేయాలన్నారు. సర్వే వల్ల రైతుల మధ్య తగాదాలు నెలకొనకుండా, రైతులు సర్వేపై సంతృప్తి చెందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ నాగన్న, మండల సర్వేయర్ అతీఫ్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతదేహం లభ్యం

బొమ్మలసత్రం: నంద్యాల రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై వీరరాజు (60) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 2పై వ్యక్తి మృతిచెందినట్లు సమాచారం అందిందన్నారు. వెళ్లి పరిశీలించగా అతని చొక్కా జేబిలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన ఓపీ చీటి ఉందని.. అందులో అతని పేరు వీరరాజుగా గుర్తించామన్నారు. బంధువులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

ట్రాన్స్‌కో ఏఈ లేక.. సమస్యలు తీరక!



మూతపడిన కార్యాలయం

జూపాడుబంగ్లా: మండల విద్యుత్‌సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఆరు మాసాల నుంచి రెగ్యులర్ ఏఈ లేకపోవటంతో విద్యుత్ వినియోగదారులు, రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారినా ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయినా, వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ తీసుకుందామన్నా ఎవరినికలవాలో తెలియక ప్రజలు మిన్నకుండిపోతున్నారు. జిల్లా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి మండలానికి రెగ్యులర్ ఏఈని నియమించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

ఆటో బోల్తా.. బాలిక దుర్మరణం

పామిడి: అనంతపురం జిల్లా రామరాజుపల్లి సమీపంలో ఆటో బోల్తాపడి బాలిక మృతి చెందింది. పోలీసులు వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన నాగేంద్ర తన సొంత ఆటోలో కుటుంబసభ్యులతో కలసి పెన్నహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు వెళ్లాడు. శుక్రవారం ఆలయం వద్ద పూజలు ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. పామిడి మండలం రామరాజుపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై వేగాన్ని నియంత్రించుకోలేక వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో నాగేంద్ర కుమార్తె శైలజ (15) అక్కడికక్కడే మృతి చెందింది. నాగేంద్ర, సుదర్శన్, మోక్షిత, రాధమ్మకు గాయాలయ్యాయి. పామిడి సీఐ యుగంధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


రాతిదూలం లాగుతున్న వృషభాలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో న్యూ కేటగిరి విభాగంలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన 11 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన శివకృష్ణచౌదరి వృషభాలు నిర్ణీత 20 నిమిషాల వ్యవధిలో 4,250 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో రూ. 1.10 లక్షలు కై వసం చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్‌కు చెందిన శ్రావణ్‌కుమార్, గుంటూరు జిల్లా గరికపాడు వెంకట్ వృషభాలు 4 వేల అడుగుల దూరంతో రెండు జతల వృషభాలు ద్వితీయ స్థానంలో రూ.90 వేలు, రూ. 70వేలు దక్కించుకున్నాయి, నంద్యాల జిల్లా పెద్దకొట్టాల కేశవరెడ్డి వృషభాలు 3,895 అడుగుల దూరంతో నాల్గవ స్థానంలో రూ. 50 వేలు, డోన్‌కు చెందిన గురునాథ్ వృషభాలు 3,752 అడుగుల దూరంతో ఐదవ స్థానంలో రూ.40 వేలు, గుంటూరు జిల్లా గరికపాడు విష్ణువర్ధన్ వృషభాలు 3,614 అడుగుల దూరంతో ఆరో స్థానంలో రూ. 30 వేలు గెలుపొందాయి.

పైపు లీకేజీ... నీరు వృథా


పైపు నుంచి లీకవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో పైపు లీకేజీ కావడంతో నీరు వృథా అవుతోంది. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నుంచి గ్రామానికి నీరు సరఫరా చేస్తారు. ట్యాంకుకు నీరు ఎక్కించే పైపు లైన్‌కు రంధ్రం పడింది. దీంతో రెండు రోజులుగా నీరు లీకవుతోంది. శుక్రవారం నీరు ట్యాంకుకు ఎక్కకుండా వృథాగా పోవడంతో గ్రామానికి సరఫరా నిలిచిపోయింది. అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.